క్లుప్తంగా

బాధిత కుటుంబానికి నాయకులు పరామర్శ



ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడుకు చెందిన మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు సురవరం లోకేశ్వర్‌రెడ్డి తల్లి సురవరం సులోచనమ్మ ఈ నెల 3న మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు.

గద్వాల రూరల్: బీచుపల్లి దేవాలయంలో ఉద్యోగం చేస్తున్న వెంకటేష్ గుండెపోటుతో మృతి చెందడం బాధకరమని మాజీ ఎమ్మెల్యే, బీచుపల్లి ఆలయ ధర్మకర్త డీకే భరత్‌సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గద్వాల పట్టణంలోని చింతలపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బండల వెంకట్రాములు, కౌన్సిలర్ బండల పాండు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన గొల్ల బీసమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పో తురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ పోతు రాజు సోమనాద్రి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

కిరాణ దుకాణంలో చోరీ

ఎర్రవల్లిచౌరస్తా: కిరాణ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం మేరకు.. ఇటిక్యాల స్టేజీ సమీపంలో చరిత కిరాణం, మనీ పాయింట్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్‌ను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. షాపులో రూ.40 వేల విలువగల సామగ్రిని తీసుకెళ్లారు. ఉదయం షాపు యజమాని తెలుగు సుధాకర్ వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్యాగ్ నుంచి నగదు..

గద్వాల క్రైం: గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తి బ్యాగ్ లోంచి నగదును అపహరించిన ఘటన పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ రెండో ఎస్‌ఐ రాము కథనం మేరకు.. అయిజకు చెందిన రంగనాథ్ మంగళవారం పని నిమిత్తం గద్వాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చాడు. గుర్తు తెలియని దుండగులు సదరు వ్యక్తి బ్యాగ్‌లో ఉన్న రూ.60వేల నగదును అపహరించారు. గుర్తించిన రంగనాథ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేటీదొడ్డిలో వర్షం



కేటీదొడ్డి: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలివానతో పాటు ఉరుములతో కూడిన వర్షం పడింది. దీంతో ముందస్తుగా పత్తి విత్తనాలు నాటిన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

గద్వాల అర్బన్: గద్వాల మండలం అనంతపురం గ్రామానికి చెందిన సుచరిత కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు మంగళవారం ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 42వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు అశోక్, శ్రీనివాసులు, సంజీవ్, పరమేష్, నాగేష్ ఉన్నారు.

టీపీసీసీని దళిత సామాజిక వర్గానికి కేటాయించాలి

గట్టు: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని దళిత సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించాలని జోగుళాంబ గద్వాల జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తప్పెట్లమొర్సు శ్రీను డిమాండ్ చేశారు. టీపీసీసీ పదవికి అన్ని విధాలుగా అర్హుడైన వ్యక్తి సంపత్‌కుమార్ అని, టీపీసీసీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

సామర్థ్యం లేని బస్సులపై చర్యలు తీసుకోండి

గద్వాల క్రైం: ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన సామర్థ్యం లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు సుబాన్, హలీంపాషా, రంగస్వామిలు మంగళవారం జిల్లా రవాణాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం నిబంధనల ప్రకారం ప్రతి ఏడాది మే 15లోపు బస్సుల సామర్థ్యం సంబంధించి పరీక్షలు చేయించుకోవల్సి ఉండగా, నేటి వరకు బస్సుల సామర్థ్యం, కండీషన్ తదితర టెస్టులు చేయించుకోలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాల బస్సుల యాజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అనుసరించ కుండా రోడ్డుపైకి వచ్చే బస్సులను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. పిల్లల సంరక్షణ దిశగా సిబ్బంది విధులు నిర్వహించాలని కోరారు.

లక్ష్యం పూర్తయ్యేనా?

- హరితాహారంలో 50 వేల మొక్కలు నాటించే లక్ష్యం
- గ్రామ నర్సరీల్లో పెంచిన మొక్కలు నాటించాలి
- ఒక్కో గ్రామంలో రెండు చోట్ల నర్సరీలు
- మొక్కల కోసం 5 కి.మీ. పరుగులు



డి.బూడిదపాడులో మొక్కలు నాటుతున్న అధికారులు

ఉండవెల్లి: వర్షాకాలంలో మొక్కలను నాటించాలి. నర్సరీలో మొక్కలను తీసుకుకొచ్చి రోడ్డుకు ఇరువైపుల నాటించాలి. ఒక్కో గ్రామ పంచాయతీకి 50 వేల మొక్కలు నాటించాలని అధికారులు వెల్లడించారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటిస్తే ఉపాధి కూలీలకు పని లభిస్తుంది. పర్యావరణాన్ని కాపాడేందుకు గత ప్రభుత్వం హరిత హారం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలు ఏర్పాటు చేసి ఒక్కో నర్సరీలో 15 నుంచి 20 వేల మొక్కలు పెంచుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, తరుచూ నర్సరీలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలిస్తున్నారు.

నర్సరీలపై ఆరా..

మండలంలో 16 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో 14 గ్రామ పంచాయతీల్లో మాత్రమే నర్సరీలను పెంచుతున్నారు. మిగితా రెండు నర్సరీలను వేరే గ్రామాల్లో ఏర్పాటు చేశారు. మారమునగాల-1 గ్రామానికి చెందిన నర్సరీని చిన్న ఆముదాలపాడు గ్రామంలో ఏర్పాటు చేశారు. ఇటిక్యాలపాడు గ్రామానికి చెందిన నర్సరీని తక్కశిలలో ఏర్పాటు చేశారు. వాటి నుంచి మొక్కలను ట్రాక్టర్ ద్వారా తరలించి రోడ్లకు ఇరువైపుల నాటుతారు.

50 వేలు పూర్తయ్యేనా..

ప్రతి గ్రామంలో 50 వేల మొక్కలు టార్గెట్ ఇవ్వండంతో టీఏలు, ఉపాధి కూలీలు, శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. మండలంలో పర్యావరణ దినోత్సవం రోజు అధికారులు మొక్కలు నాటారు. ఇప్పటికి మండలంలో మొత్తం 5వేలు మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. వర్షాకాలం లోపు ప్రతి గ్రామంలో 50 వేల మొక్కలు నాటుతారా? అని ఆలోచనలో పడ్డారు. పొలాల్లో పనులు ప్రారంభం కావడంతో ఉపాధి కూలీలు రాకపోవడంతో ఇబ్బందులు పడతారని టీఏలు ఆలోచనలో పడుతున్నారు. మొక్కలు నాటించే కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా అధికారులపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



గుంతలు తీస్తున్న ఉపాధి కూలీలు



తక్కశిలలో రెండు నర్సరీల ఏర్పాటు

ప్రతి గ్రామంలో మొక్కలు నాటుతున్నారు



మండలంలో ప్రతి గ్రామంలో మొక్కలను నాటుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొక్క లు నాటించాలని కార్యదర్శులకు, టీఏలకు సూచనలు అందిస్తున్నాం. త్వరలో టార్గెట్ పూర్తి చేస్తాం.

– అబ్దుల్ జబ్బార్, ఎంపీడీఓ, ఉండవెల్లి

బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిది



అలంపూర్‌లో బడిబాట కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

- బడిబాట సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: బడీడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట అలంపూర్ మున్సిపాలిటీ, మండల స్థాయి సమావేశం ఎంపీపీ బేగం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బేగం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనోరమ, మున్సిపల్ కమిషనర్ సరస్వతిలు హాజరై మా ట్లాడారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన, నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయుల ద్వారా బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 2 జతల స్కూల్ యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో పనులు పూర్తి చేసుకోనే విధంగా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ఐదేళ్లు దాటిన విద్యార్థులను 1వ తరగతిలో చేర్పించాలన్నారు. విద్యార్థులు బడిబయటికి వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బడిబాటను విజయవంతం చేద్దామన్నారు. ఎంఈఓ అశోక్ కుమార్ మాట్లాడారు. పాఠశాలలకు కావాల్సిన పుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. స్కూల్ యూనిఫామ్స్ పాఠశాలలకు అందించినట్లు తెలిపారు. పాఠశాలల పునః ప్రారంభం రోజు బడిలో పండగ వాతావరణం ఉండేలా చూడాలన్నారు. అనంతరం బడిబా టకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ ఇంతియాజ్, మున్సిపల్ ఏఈ మేఘనాథ్ గౌడ్, జీహెచ్ఎంలు బాలాజీ కృష్ణకుమార్, ఏపీఎం ప్రవీణ, అంగన్‌వాడీ సూపర్ వైజర్ జయమ్మ, హాస్టల్ వార్డెన్ సుజాత, మెప్మా ఆర్పీ ధనుంజయ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు

విద్యార్థుల యూనిఫాం పంపిణీ



ధరూరులో ఉపాధ్యాయులకు యూనిఫాంను అందజేస్తున్న మహిళా సంఘాల లీడర్లు



జాంపల్లిలో..

ధరూరు: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని జాంపల్లి, అల్వలపాడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంను పంపిణీ చేశారు. మంగళవారం వీఓఏ -2 పద్మ, గ్రామ సంఘం-2 అధ్యక్షురాలు ఖాజాబీ, ఐకేపీ సీసీలు జయరాజ్, నవీన్‌కుమార్‌లు పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి పాఠశాల విద్యార్థులకు యూనిఫాంను అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అంగ న్‌వాడీ టీచర్లు వీరమ్మ, నాగమ్మ, సరోజ, గ్రామ సంఘం లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఉండవెల్లి: సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను ఈ నెల 13న మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉండవెల్లి, అలంపూర్, మానవపాడు మండలాల్లోని కార్యకర్తలకు ఈ నెల 13 నుంచి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దిలేటి, రాజు, వెంకటేశ్వర్లు, నాయకులు నరసింహ, రాముడు, వెంకటేశ్వర్లు, సుంకన్న, మల్లి తదితర్లు పాల్గొన్నారు.

రైతులతో వీడియో కాన్ఫరెన్స్



అయిజలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైను రైతులు, అధికారులు

అయిజ: వానాకాలం పంటలపై రైతులకు, వ్యవసాయ అధికారులకు, అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వ్యవసాయ అధికారులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతు వేదిక భవనానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు వానాకాలం పంటలపై అవగాహన కల్పించారు. అధిక సాంద్రత భూమిలో పత్తి సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. రైతుల, వ్యవసాయ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈసందర్భంగా సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఏఓ శంకర్‌లాల్, ఈఏఓలు, రైతులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శపాఠశాల పనులు ముమ్మరం



కొర్విపాడులో కిటికీ ఏర్పాటు పనులు



బుర్దిపాడులో బండలు వేస్తున్న కార్మికుడు



కొర్విపాడులో ఏర్పాటు చేసిన నీటి కొలాయిలు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పాఠశాల అభివృద్ధి పనులను అమ్మ ఆదర్శ పాఠశాలగా మండలంలో 15 పాఠశాలలో పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని 15 గ్రామాల్లో పాఠశాలకు సంబంధించిన మరుగుదొడ్లు, నీటికొలాయి సమస్యలు, కిటికీలు, తదితర మౌలిక వసతులకు సంబంధించిన పనులను నిర్వహిస్తున్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

గట్టు: విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని బహుజన్ సమాజ్ వాది పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి బండారి రాజు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ బల్గెర మోజేష్‌లు కోరారు. మంగళవారం తప్పెట్లమొర్సు లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండారి రాజు, మోజేష్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యను వ్యా పారంగా మార్చేస్తున్నారని ఆరోపించారు. పేదలు పిల్లలు చదువుకునే సర్కార్ బడుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నట్లు పేర్కొన్నారు. వి ద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయా లని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సిట్లను కేటాయించాలనే నిబంధన ఉన్నా, జిల్లాలో అమలు కావడం లేదన్నారు. అధికారులు స్పందించి విద్యాహక్కు చట్టం అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దండురాజు, ప్రేమ్‌రాజు, ప్రసాద్, లాజర్, యువరాజు, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: గద్వాల-అయిజ ప్రధాన రహదారిలోని అమరవాయి నుంచి సద్దలోనిపల్లి స్టేజీ వరకు ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు వెంకటన్న, రవి, కిష్టన్న, కృష్ణయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. 8 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మండల వనరుల కేంద్రంలో విషసర్పం



మానవపాడు: మండలంలోని వనరుల కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం విషసర్పం దర్శనమిచ్చింది. దీంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. చాలా సమయం వరకు విషసర్పం వల్ల కార్యాలయ సిబ్బంది భయంగా ఉన్నారు. కార్యాలయం చుట్టూ అపరిశుభ్రంగా ఉండడం, సరిగా బండలు లేక రంధ్రాలు ఏర్పడడం వల్ల విషసర్పాలు సంచరిస్తున్నాయని, కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిల్లల వివరాలు సేకరించండి



అంగన్‌వాడీ, మెప్మా సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి

శాంతినగర్: బడీడు కలిగిన పిల్లల వివరాలు సేకరించాలని వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సిబ్బందికి, అధికారులకు సూచించారు. వడ్డేపల్లి పురపాలిక కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలను బడుల్లో చేర్పించి బడిపిల్లల సంఖ్య పెంచాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా సిబ్బంది ఆయా వార్డులకు వెళ్లి పిల్లల వివరాలు సేకరించి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించి బడికి పంపేలా చూడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కరుణ, కౌన్సిలర్లు, సిబ్బంది, అంగన్‌వాడీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలతో పనులు చేయించొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ సరితారాణి

గట్టు: పత్తి పొలాల్లో బడీడు పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సరితారాణి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన సీడ్ ఆర్గనైజర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరితారాణి మాట్లాడుతూ సీడ్ పత్తి పొలాల్లో 14 ఏళ్లలోపు చిన్నారులతో పనులు చేయించొద్దని ఆర్గనైజర్లకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా బడీడు పిల్లలతో పనులు చేయిస్తే సంబంధిత పొలం యజమానులపై చర్యలు తప్పవన్నారు. బాలల బంగారు భవిష్యత్‌కు పాఠశాలల్లోనే పునాదులు పడతాయని, 14 ఏళ్ల లోపు బాల బాలికలు తప్పని సరిగా బడిలోనే ఉండే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గట్టు మండలంలో ఒక్కరూ బడి బయట ఉండకుండా చూద్దామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. త్వరలోనే మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలేష్, డీసీపీయూ లక్ష్మీదేవి, పోలీస్ కానిస్టేబుల్, వివిధ గ్రామాలకు చెందిన సీడ్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను బలోపేతం చేయాలి



రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ల సమావేశంలో పాల్గొన్న గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల రూరల్: మున్సిపాలిటీలను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలోని ప్రజాప్రతినిధులకు గొడ్డలిపెట్టుగా మారిన 2019 మున్సిపల్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని తెలంగాణ మున్సిపల్ చైర్మన్ల సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ చైర్మన్లు మంగళవారం హైదరాబాదులోని తెలంగాణ ఛాంబర్‌లో రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ముఖ్యసమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ బిల్లు



ఇటిక్యాలలో ఉచిత కరెంట్ బిల్లును అందిస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గ్రామస్తులకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ బిల్లులను అందించారు. ఈ సందర్భంగా మండల బీసీ సెల్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజలకు అందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో మంగలి నారాయణ, శేఖర్, తదితరులు ఉన్నారు.